సింగూరు ప్రాజెక్టుకు

ఆగని వరద

● ఇన్ ఫ్లో 30,410..
ఔట్ ఫ్లో 38,610 క్యూసెక్కులు


7

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5 సిద్దిపేట

గురువారం 9 అక్టోబరు 2025



ఇక..ఠాణాల్లో పైరవీలు బంద్

● దళారులకు పోలీస్‌స్టేషన్లలో ప్రవేశం లేదు ● ఉచితంగా చేసే పనులకు డబ్బులు అడగొద్దు

● అవినీతి, అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు
● ప్రభుత్వ అధికారులను వేధిస్తే సహించం
● ఎమర్జెన్సీ, పోలీస్ వాహనాలకే సైరన్ ఉండాలి
● సిద్దిపేట సీపీ ఎస్.ఎం విజయ్‌కుమార్

సిద్దిపేట, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పోలీస్‌స్టేషన్లలో పైరవీలు చేసే దళారులు తమ పనులు మానుకోవాలని సిద్దిపేట నూతన పోలీస్ కమిషనర్ ఎస్.ఎం విజయ్‌కుమార్ సున్నితంగా హెచ్చరించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మధ్యవర్తులకు ఠాణాల్లో ప్రవేశం లేదని, సెటిల్మెంట్లు ఉంటే బయట చూసుకోవడమో లేదా కోర్టుకు వెళ్లాలని సూచించారు. బాధితులు నేరుగా పోలీసులను సంప్రదించాలని చెప్పారు. కొన్నిచోట్ల అవినీతి ఆరోపణలు తన దృష్టికి వచ్చాయని, ఉచితంగా చేయాల్సిన పనులకు డబ్బులు అడగవద్దన్నారు. అవినీతి, అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

ఏ పార్టీవారైనా సమానమే..

నంగునూరు మండలంలో ప్రభుత్వ అధికారులను కొంతమంది వేధించిన విషయంపై సీపీ స్పందించారు. ప్రభుత్వ అధికారులను వేధిస్తే సహించేది లేదన్నారు. ఏ పార్టీ వారైనా వారి రాజకీయాలు బయట చూసుకోవాలని, పోలీసులకు అందరూ సమానమే అంటూ విజయ్‌కుమార్ వెల్లడించారు. ఇష్టారాజ్యంగా వాహనాలకు సైరన్ వినియోగించడం నేరం అని అన్నారు. పోలీసులు, ఎమర్జెన్సీ వాహనాలకు మాత్రమే సైరన్ ఉండాలని.. ఇంకెవరు వినియోగించినా ఉపేక్షించకూడదని తెలిపారు. ఇటీవల ఆన్‌లైన్ మోసాలు ఎక్కువగా నమోదవుతున్నందున అప్రమత్తంగా ఉండాలని సలహా ఇచ్చారు. ఆన్‌లైన్ బెట్టింగ్ ఆడినట్లయితే కేసులు పెడుతామన్నారు. ఆన్‌లైన్‌లో రుణాలు కూడా తీసుకోవద్దని హితబోధ చేశారు. ఆన్‌లైన్ల ద్వారా బాగుపడిన వ్యక్తులు ఎవరూ లేరని, పైగా మోసపోయి ఆత్మహత్యలు చేసుకున్నారని తెలిపారు. జిల్లాకు ఒక సైబర్ పోలీస్‌స్టేషన్‌ను ఏర్పాటు చేశామని, ఎవరైనా మోసపోయినట్లయితే వెంటనే 1930 నంబర్‌కు కాల్ చేయాలని సూచించారు. సిద్దిపేట జిల్లాలో మహిళలపై వేధింపులు ఎక్కువగా ఉన్నట్లు తన దృష్టికి వచ్చిందని.. ఆ దిశగా తగిన ప్రణాళిక సిద్ధం చేస్తామన్నారు.

అక్రమాలపై ఉక్కుపాదం..

అక్రమంగా ఇసుక, మట్టి, రేషన్ బియ్యం తరలిస్తే ఉక్కుపాదం మోపుతామని సీపీ విజయ్‌కుమార్ హెచ్చరించారు. బెల్టు షాపుల నిర్వహణ కూడా పూర్తి చట్ట వ్యతిరేకమన్నారు. ప్రతీ ఊరిలో పదికి పైగానే బెల్టుషాపులు ఉన్నాయని, వీటిని తక్షణమే మూసివేయాలని సూచించారు. డ్రగ్స్, గంజాయి విక్రయదారులపైనా నిఘా పెంచుతామన్నారు. డ్రగ్స్ రహిత జిల్లాగా చేయడంపై దృష్టి పెడతానని వివరించారు. గంజాయిపై సమాచారం తెలిస్తే నేరుగా తనకే ఫోన్ చేయవచ్చన్నారు. లేదంటే 100 డయల్‌కు

మిగతా 8వ పేజీలో



సిద్దిపేట నూతన పోలీస్ కమిషనర్ విజయ్‌కుమార్

'పది' ఫలితాల్లో వందశాతం

ఉత్తీర్ణత సాధించాలి

● డీఈవో శ్రీనివాస్‌రెడ్డి

రాయపోల్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): పదో తరగతిలో వందశాతం ఉత్తీర్ణత లక్ష్యంతో ముందుకు సాగాలని జిల్లా విద్యాశాఖ అధికారి యెల్లంకి శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. మండలంలోని రామారం, బేగంపేట పాఠశాలలను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ... ఉపాధ్యాయులు ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధం చేసుకుని ప్రతి రోజూ టెస్టులు నిర్వహించాలని, పిల్లలకు పరీక్షలపై ఉన్న ఒత్తిడిని తొలగించాలని సూచించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించాలని ఆదేశించారు. ఆయన వెంట ఎంఈవో సత్యనారాయణరెడ్డి, ప్రధానోపాధ్యాయులు రాజగోపాల్‌రెడ్డి, ప్రమీల, సీఆర్‌పీలు ఉన్నారు.

కుమారులతో కలిసి

భర్తను చంపిన భార్య

● కాళ్లు చేతులు కట్టేసి..
● నడుముకు బండరాయి కట్టి బతికుండగానే నదిలో పడేసి హత్య
● రెండు రోజుల తర్వాత తేలిన మృతదేహం

మిస్టరీగా గురుకుల

విద్యార్థి మృతి

● 24 గంటల తర్వాత పోలీసు బందోబస్తు మధ్య పోస్టుమార్టం

6



స్లాట్ ఉంటేనే

పత్తికి మద్దతు!

పత్తి కొనుగోళ్లకు సంబంధించి కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ఈ ఏడాది కొత్త నిబంధనలను కఠినంగా అమలు చేయనుంది. రైతులు కపాస్ కిసాన్ యాప్‌లో స్లాట్ బుకింగ్ చేసుకుంటేనే మార్కెట్ యార్డులు/కొనుగోలు కేంద్రాల్లో పత్తిని విక్రయించడానికి అవకాశం ఉంటుంది. ఈ నూతన విధానం వల్ల దళారులు, మధ్యవర్తుల అక్రమాలకు అడ్డుకట్ట పడనుంది. అలాగే, జిన్నింగ్ మిల్లుల వద్ద రైతులు గంటల తరబడి పడిగాపులు కాయాల్సిన అవసరం కూడా తప్పుతుంది.

● ఈ ఏడాది సీసీఐ కొత్త నిబంధనలు
● అక్రమాలకు చెక్‌పెట్టేలా 'కిసాన్ కపాస్' అమలు
● జిల్లాలో 1.07 లక్షల ఎకరాల్లో పత్తి సాగు

సిద్దిపేట కలెక్టరేట్, అక్టోబరు 8 : ఈ నెల 4న అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ అధికారులకు పత్తి కొనుగోలు విధానంపై అవగాహన కల్పించారు. ప్రస్తుతం అధికారులు ఆయా గ్రామాల్లోని రైతులకు యాప్ డౌన్‌లోడ్, స్లాట్ బుకింగ్ ప్రక్రియపై వివరిస్తున్నారు. ఈ నెల మూడో వారంలో పత్తి కొనుగోళ్ల ప్రారంభమయ్యే అవకాశం ఉంది.

దళారుల దోపిడీకి చెక్

రైతుల నుంచి పత్తి కొనుగోళ్లలో మధ్యవర్తుల జోక్యం, దోపిడీ గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఇటువంటి అక్రమాలకు చెక్ పెట్టేందుకు సీసీఐ 'కపాస్ కిసాన్' యాప్‌ను తీసుకొచ్చింది. ఈ యాప్ ద్వారా రైతులు నేరుగా స్లాట్ బుక్ చేసుకొని, తమ పంటను ప్రభుత్వ మద్దతు ధరకే విక్రయించుకోవచ్చు. కొంతమంది వ్యాపారులు, దళారులు ఇతరుల రైతుల పేర్ల మీద సీసీఐకి పత్తి విక్రయించి లబ్ధి పొందుతున్నారు. ఈ కొత్త నిబంధనలతో అటువంటి అక్రమాలకు చెక్ పడనుంది. అధికారులు అంచనా వేసిన దిగుబడి మేరకు మాత్రమే పత్తిని కొనుగోలు చేస్తారు. గత ఏడాది జిల్లాలో కొంతమంది దళారులు రైతుల పేరుతో ఎక్కువ మొత్తంలో పత్తిని సీసీఐకి విక్రయించినట్లు తేలడంతో, అప్పట్లో సంబంధిత వ్యవసాయ, మార్కెటింగ్ అధికారులపై వేటు పడిన విషయం తెలిసిందే.


యాప్‌లో వివరాల నమోదు ఇలా..

కేంద్ర ప్రభుత్వం కిసాన్ కపాస్ యాప్‌ను గతేడాది ప్రవేశపెట్టినా, అది పూర్తిస్థాయిలో అమలులోకి రాలేదు. అయితే, ఈసారి కచ్చితంగా అమలు చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. పత్తి విక్రయించాలనుకునే రైతులు సాగుకు సంబంధించిన పూర్తి వివరాలను నమోదు చేసి, స్లాట్ బుక్ చేసుకోవాల్సి ఉంటుంది.

● గూగుల్ ప్లే స్టోర్ నుంచి "కపాస్ కిసాన్" యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి.

● ఆ తర్వాత రైతు పేరు, జెండర్, పుట్టిన తేదీ, కులం, చిరునామా, ఆధార్ నంబర్, మొబైల్ నంబర్ వంటి వ్యక్తిగత వివరాలు నమోదు చేయాలి. పంట వివరాలు తెలియజేయాలి. సొంత భూమి లేదా కౌలుదారు అనేది వివరించాలి.

● పట్టాదారు పాస్ పుస్తకం నంబర్, సర్వే నంబర్, మొత్తం భూమి విస్తీర్ణం, పత్తి సాగు విస్తీర్ణం, పంట రకం లాంటి వివరాలతో పాటు రైతు ఫొటోను అప్‌లోడ్ చేయాలి.



జిల్లాలో 1.07 లక్షల ఎకరాల్లో పత్తి సాగు

ఈ ఏడాది జిల్లాలో 1.07 లక్షల ఎకరాల్లో పత్తి పంటను రైతులు సాగు చేశారు. దీని ద్వారా సుమారు 12.86 లక్షల క్వింటాళ్ల పత్తి దిగుబడి వస్తుందని అధికారులు అంచనా

మిగతా 8వ పేజీలో



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

స్వేచ్ఛ, నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించాలి

● కలెక్టర్ హైమావతి

సిద్దిపేట అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలను స్వేచ్ఛ, నిష్పక్షపాతంగా, ఎన్నికల ప్రవర్తనా నియమావళికి భంగం కలగకుండా నిర్వహించాలని కలెక్టర్ హైమావతి సూచించారు. బుధవారం కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ హైమావతి, సీపీ విజయ్ కుమార్, అదనపు కలెక్టర్లు గరీమా అగ్రవాల్, అబ్దు ల్ హమీద్‌తో కలిసి స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా క్రిటికల్ పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, సిబ్బంది విధులు తదితర అంశాలపై సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేశారు. క్రిటికల్ పోలింగ్ కేంద్రాలను గుర్తించి సెక్టోరల్ అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీ చేయాలని, ఏమైనా ఇబ్బందులుంటే వాటిని నిర్దేశించిన ఫార్మెట్‌లలో నివేదికలను సిద్ధం చేయాలని ఆదేశించారు. ఎక్కడా శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా ఎస్‌హెచ్‌వో, తహసీల్దార్, ఎంపీడీవో, గ్రామస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులతో మం డల, గ్రామస్థాయిలో సమావేశాలు నిర్వహించాలన్నారు.

వైద్య ఆరోగ్య శాఖపై సమీక్ష

వైద్య ఆరోగ్య శాఖ ప్రగతిపై అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్‌తో కలిసి కలెక్టర్ సమీక్షించారు. డెంగ్యూ లక్షణాలు గుర్తించిన వెంటనే వైద్య సిబ్బంది తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు. ఆర్‌ఎంపీ వైద్యులు తెలిసీ తెలియక నిర్లక్ష్యంగా వైద్యం చేసి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే, వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఆదేశించారు. ప్రతినెలా ఆర్‌ఎంపీ ల పనితీరుపై మెడికల్ ఆఫీసర్లు తనిఖీలు చేసేలా లక్ష్యాన్ని నిర్ధేశించాలని డీఎంహెచ్‌వో ధనరాజ్‌ను ఆదేశించారు. ముందస్తు అనుమతి లేకుండా సిబ్బందికి ఎటువంటి సెలవులు మంజూరు చేయరాదని, విధులకు హాజరుకాని ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ చెప్పారు.

లోక్ కల్యాణ్ మేళాకు

స్పందన కరువు

● వీధి వ్యాపారులకు చేరని కేంద్ర పథకం ● దరఖాస్తు గడువు ఈ నెల 15 వరకు పొడిగింపు



దుబ్బాకలోని వీధివ్యాపారులు

దుబ్బాక, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : మున్సిపాలిటీల్లోని నిరుపేద వీధి వ్యాపారుల ఆర్థిక సాధికారత, వ్యాపార అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం చేపట్టిన బృహత్తర కార్యక్రమం వీధి వ్యాపారుల్లోకి తీసుకెళ్లడంలో మున్సిపాలిటీలు విఫలం కావడంతో ప్రభుత్వం అనుకున్న లక్ష్యాన్ని చేరలేకపోయింది. స్పందన కరువైన లోక్ కల్యాణ్ మేళా కోసం ప్రభుత్వం దరఖాస్తు గడువును ఈ నెల 15 వరకు పొడిగించింది. సిద్దిపేట, దుబ్బాక, గజ్వేల్, హుస్నాబాద్, చేర్యాల మున్సిపాలిటీల్లో అనుకున్నంత స్పందన రాకపోవడంతో ప్రభుత్వం మరోమారు అవకాశం కల్పించింది.

పీఎం స్వనిధి (ప్రధాన మంత్రి స్ట్రీట్ వెండర్స్ ఆత్మ నిర్భర్ నిధి) ద్వారా రుణాలు అందించేందుకు కేంద్రం నిర్ణయించింది. జిల్లాలోని ఐదు మున్సిపాలిటీల్లోని వీధి వ్యాపారులకు వారి ప్రయోజనం బట్టి రూ.15 వేల నుంచి రూ.50వేల వరకు రుణాలను మెప్మా (పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ) ద్వారా అందిస్తోంది. వ్యాపారులకు లక్ష్యం కన్నా అధిక సంఖ్యలో రుణాలు ఇచ్చే లక్ష్యంతో గత నెల 17 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు ఆసక్తి కలిగిన నూతన వీధి వ్యాపారుల నుంచి దరఖాస్తులు స్వీకరించి, ఆన్‌లైన్ నమోదుకు నిర్ణయించారు. వ్యాపారుల నుంచి ఆశించిన స్పందన రాకపోవడం, వరుసగా బతుకమ్మ, దసరా పండగ సెలవులతో తాజాగా ఈ గడువును ఈ నెల 15 వరకు పొడిగించారు.

20 రోజుల్లో దరఖాస్తులు 104 మాత్రమే

జిల్లాలోని దుబ్బాక, సిద్దిపేట, గజ్వేల్, ప్రజ్ఞాపూర్, హుస్నాబాద్, చేర్యాల మున్సిపాలిటీల్లో గతంలో రుణాలు తీసుకోని, సక్రమంగా చెల్లించిన వీధి వ్యాపారులతో పాటు నూతనంగా మరో 276 మంది వీధి వ్యాపారులకు లోక్ కళ్యాణ్ మేళా ద్వారా రుణాలు అందించేందుకు మెప్మా చర్యలు చేపట్టింది. గత 20 రోజుల్లో రుణాల కోసం నూతన వీధి వ్యాపారులు కేవలం 104 మంది మాత్రమే ఇప్పటి వరకు దరఖాస్తులు చేసుకున్నారు. ఈ పథకం ద్వారా వీధి వ్యాపారులకు మూడు విడతల్లో ప్రభుత్వం రుణాలు మంజూరు చేయనుంది. మొదటి విడతలో ఎలాంటి పూచీకత్తు లేకుండా రూ.15వేలు అందిస్తారు. అది పూర్తిగా వాయిదాల్లో చెల్లించిన తర్వాత రెండో విడతలో రూ.25వేలు, మూడో విడతలో రూ.50 వేల రుణాన్ని మంజూరు చేస్తారు. గతంలో జిల్లా వ్యాప్తంగా 13,241వీధి వ్యాపారులు రుణాల కోసం దరఖాస్తు చేసుకోగా, వారిలో 12,600 మంది రూ.10 వేల చొప్పున రుణం పొందారు. అనంతరం వీరిలో 6,500 మంది రూ.20వేలను, 2200 మంది రూ.50 వేల రుణాన్ని పొందారు. ఈ పథకానికి సంబంధించి పురపాలికలోని మెప్మా కార్యాలయంలో దరఖాస్తులు తీసుకోవడంతో పాటు సిబ్బంది పట్టణాల్లోని వీధి వ్యాపారుల వద్దకు వెళ్లి, వారి ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా, ఇతర గుర్తింపు కార్డుల ద్వారా వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. అనంతరం అధికారులు వాటిని పరిశీలించి, రుణాలను వ్యాపారుల ఖాతాల్లో జమ చేస్తారు.

వరి రైతుకు

వాన గండం



మహ్మదాపూర్‌లో నేలవాలిన వరి చేను

● వరి కోతల సమయంలో వెంటాడుతున్న వర్షాలు
● యేటా ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టాలు
● వాన భయంతో ముందస్తుగా కోతలకు సిద్ధమవుతున్న రైతులు

హుస్నాబాద్‌రూరల్, అక్టోబరు8 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికి వచ్చే సమయంలో ప్రకృతి వైపరీత్యాలతో రైతు లు నష్టాల పాలవుతున్నారు. వర్షాలు రైతులకు కునుకు లేకుండా చేస్తున్నాయి. ఇప్పటికే భారీ వర్షాలు, వరదలు అన్నదాతలను ఆగం చేయగా... కోతల సమయంలో నిత్యం వర్షాలు కురవడంతో రైతన్నలు ఆందోళనకు గురవుతున్నారు.

హుస్నాబాద్ డివిజన్‌లోని కోహెడ, అక్కన్నపేట, బెజ్జెంకి, హుస్నాబాద్ మండలాల్లో ఖరీఫ్‌లో 71వేల ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. వాన భయంతో నష్టం జరిగినా సరేనని ముందస్తుగా కోతలు కోస్తున్నారు. హుస్నాబాద్ మండలంలో 28,604 ఎకరాల భూ విస్తీర్ణంలో 18 వేల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేశారు. ఇందులో 13240 ఎకరాల్లో వరి సాగు చేయగా, ముందుగా వేసిన వరి పంటలు కోతకు వచ్చాయి. వర్షాల భయంతో చేతికి వచ్చిన పంట నేలపాలు కావడంతో... పెట్టిన పెట్టుబడులు చేతికి వస్తాయో రావో అని రైతులు ఆందోళన చెందుతున్నారు. కొందరు రైతులు ఇరవై రోజుల తర్వాత కోత కోయాల్సిన పంటను ముందస్తుగానే కోతలు మొదలు పెట్టారు. హుస్నాబాద్ మండలంలోని నాగారం, కూచనపల్లి, మహ్మదాపూర్, మడద, రాములపల్లి, పోతారం(ఎస్), పొట్లపల్లి, పందిల్ల గ్రామాల్లో ముందస్తుగా వరి కోతలు ప్రారంభించారు. ప్రస్తుతం హుస్నాబాద్ మార్కెట్ యార్డులో సింగిల్‌విండో ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. ప్రభుత్వ మద్దతు ధరతో కొనుగోలు కేంద్రంలో ధాన్యం విక్రయించుకోవడానికి రైతులు సన్నద్ధమయ్యారు.



హుస్నాబాద్‌లో ముందస్తుగా వరి కోత కోస్తున్న రైతులు



పెట్టుబడి వచ్చే పరిస్థితి లేదు

రోజు కురుస్తున్న వర్షంతో చేతికి వచ్చే దశలో పంట నేలవాలడంతో తీవ్రంగా నష్టం ఏర్పడనుంది. 1.20ఎకరాల్లో రూ. 50 వేల పెట్టుబడి పెట్టి సాగు చేశా. వర్షాలకు పంట చేను మొత్తం నేలవాలడంతో పెట్టుబడి వచ్చే పరిస్థితి లేదు.

- నర్సింహారెడ్డి,రైతు మహ్మదాపూర్

ముందుగానే వరి కోస్తున్నాం



ఇంకో 15 రోజులు తర్వాత కోయాల్సిన వరిచేను వాన భయంతో... రెక్కల కష్టం నేలపాలు కాకముందే కోసేందుకు సిద్ధపడ్డాము. వరి చేను బురదలో ఒరిగితే పంట చేతికి రాకుండా నేలపాలవుతుంది.

-తిప్పర్ల మమత, కౌలురైతు హుస్నాబాద్

దుబ్బాకలో బొడ్రాయి

ప్రతిష్ఠాపనోత్సవాలు ప్రారంభం

దుబ్బాక, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలో బొడ్డురాయి ప్రతిష్ఠాపన మహోత్సవం బుధవారం ఘనంగా ప్రారంభించారు. బుధవారం ఉదయం నాభిశిలావిగ్రహంతో పట్టణంలో ఊరేగింపుగా శోభాయాత్ర నిర్వహించారు. విగ్రహానికి మహిళలు రాగిబిందెలతో నీరుపోస్తూ, ఘటాభిషేకం నిర్వహించారు. పట్టణంలోని అన్ని ఇళ్లను తోరణాలతో అలంకరించి, నాభిశిలావిగ్రహం శోభాయాత్రకు స్వాగతం పలికారు. మంగళహారతులు, కొబ్బరికాయలతో పూజలు జరిపారు. అనంతరం పట్టణంలోని ఉమామహేశ్వరాలయం వద్ద ప్రతిష్ఠించేందుకు నాభిశిలను తీసుకువచ్చారు. మూడు రోజుల పాటు వివిధ వైదిక కార్యక్రమాలతో పూజలు నిర్వహించి, శుక్రవారం ఉదయం 11గంటలకు రాంపూర్ పీఠాధిపతులు మాధవానందసరస్వతి పర్యవేక్షణలో నాభిశిల ప్రతిష్ఠ నిర్వహించనున్నారు.



దుబ్బాకలో బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవంలో భక్తులు

బస్టాండ్‌లో బాంబు స్క్వాడ్ తనిఖీ

తూప్రాన్ అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): తూప్రాన్ పట్టణ పరిధిలోని బస్టాండ్‌లో బాంబ్ స్క్వాడ్ నార్కోటిక్ డాగ్ స్క్వాడ్‌తో విస్తృత తనిఖీలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ శ్రీనివాస్‌రావు ఆదేశాల మేరకు తూప్రాన్ పోలీస్ స్టేషన్ పరిధిలో విస్తృత తనిఖీలు చేపట్టారు. ముఖ్యంగా బస్ స్టేషన్, దాబాలు, హోటళ్లు, పాన్ షాపులలో తనిఖీలు చేపట్టారు. ఎక్కడైనా అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు గమనించినా పోలీసులకు సమాచారం ఇవ్వాలని అన్నారు. జిల్లా వ్యాప్తంగా శాంతి భద్రతలు పరిరక్షణ కోసం ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉంటామని ఎస్పీగారు తెలిపారన్నారు. ఇందులో తూప్రాన్ ఎస్ఐ జ్యోతి, ఏఎస్ఐ శ్రీనివాస్, డాగ్ స్క్వాడ్ శ్రావణ్, సిద్ధిరాములు సిబ్బంది పాల్గొన్నారు.



తూప్రాన్ బస్ స్టేషన్‌లో బాంబ్ స్క్వాడ్ తనిఖీ చేస్తున్న పోలీసులు

కుమారులతో కలిసి భర్తను చంపిన భార్య

కుకునూరుపల్లి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): రోజూ మద్యం తాగి వచ్చి గొడవ పడుతున్నాడని ఇద్దరు మైనర్ కుమారులు.. మరో ముగ్గురితో కలిసి కొట్టి.. బతికి ఉండగానే కాళ్లు చేతులు కట్టేసి.. నీళ్లలో బయటకి తేలకుండా నడుముకు బండరాయి కట్టి వాగులో పడేసింది ఓ భార్య. తర్వాత ఏం జరగనట్లు రోజువారీ పనులు చేసుకుంది. రెండు రోజుల తర్వాత వాగులోంచి మృతదేహం తేలడంతో గ్రామస్థులు చూసి ఫిర్యాదు చేయగా, రంగంలోకి దిగిన పోలీసులు హత్య కేసును ఛేదించారు. ఇందుకు సంబంధించిన వివరాలను గజ్వేల్ ఏసీపీ తోట నర్సింహులు, సీఐ లతీఫ్, ఎస్సై శ్రీనివాస్ వివరించారు. మండలంలోని తిప్పారం గ్రామానికి చెందిన సింధు సంతోషికి కరీంనగర్ జిల్లాకు చెందిన మహేందర్‌తో వివాహం జరిగింది.

భార్యాభర్తల మధ్య గొడవలు జరగడంతో సంతోషి ఇద్దరు పిల్లలను తీసుకుని తిప్పారం గ్రామానికి వచ్చి ఉంటోంది. నెల రోజుల క్రితం గ్రామానికి వచ్చిన మహేందర్ భార్యాపిల్లలతోనే ఉంటున్నాడు. అయితే, రోజూ మద్యం తాగి వచ్చి, గొడవ పడుతున్నాడు. శనివారం రాత్రి మహేందర్ భార్యాపిల్లలతో గొడవ పెట్టుకున్నాడు. ఈ క్రమంలో మైనర్ అయిన అతడి పెద్ద కుమారుడు మహేందర్ తలపై కర్రతో కొట్టగా, కింద పడిపోయాడు. కొద్దిసేపటి తర్వాత లేచి బయటకు వెళ్లాడు. సాయంత్రం మళ్లీ తాగి వచ్చి గొడవ పడ్డాడు. మద్యం మత్తులో స్పృహ తప్పి పడిపోయాడు. దీంతో సంతోషి తన ఇద్దరు మైనర్ కుమారులతో పాటు తన బంధువులు అయిన అదే గ్రామానికి చెందిన మరో ముగ్గురి సహాయంతో మత్తులో ఉన్న భర్తను ఆటోలో కూడవెల్లి వాగు వద్దకు తీసుకెళ్లింది. అక్కడ కాళ్లు చేతులు కట్టేసి, నదిలో నుంచి బయటకు రాకుండా నడుముకు తాడుతో బండరాయి కట్టి బతికుండగానే నదిలో పడేశారు.

ఇదంతా శనివారం రాత్రి జరగగా, ఏం జరగనట్లు ఇంటికి వచ్చి ఎవరి పనుల్లో వారు నిమగ్నమయ్యారు. అయితే, సోమవారం సాయంత్రం కూడవెల్లి వాగులో ఓ మృతదేహం నీటిపై తేలుతూ కనిపించగా, గ్రామస్థులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడిని మహేందర్‌గా గుర్తించి, అతడి భార్యాపిల్లలు, బంధువులను అదుపులోకి తీసుకుని విచారించగా, జరిగిన విషయాన్ని చెప్పారు. వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని భర్తను హత్యచేసినట్లు భావిస్తున్నారు.

మిస్టరీగా గురుకుల విద్యార్థి మృతి

హుస్నాబాద్‌రూరల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ మండలం జిల్లెలగడ్డలోని సాంఘీక సంక్షేమశాఖ బాలుర గురుకులంలో ఎనిమిదవ తరగతి విద్యార్థి సనాదుల వివేక్ (13) మృతి ఇంకా మిస్టరీగానే మిగిలింది. మంగళవారం ఉదయం డ్రిల్‌పీరియడ్‌లో హాస్టల్ కారిడార్‌లో ఆడుకుంటుండగా ప్రమాదవశాత్తు మెడకు తాడు చుట్టుకుని వివేక్ మృతి చెందినట్లు పాఠశాల ఉపాధ్యాయులు తెలుపారు. తమ కుమారుడి మృతిపై పలు అనుమానాలు ఉన్నాయని మృతుడు వివేక్ తల్లితండ్రులు సనాదుల సత్యనారాయణ-లావణ్య బంధువులు ఆరోపించారు. మొదటి రోజు బంధువుల ఆందోళనలు రాస్తారోకోతో పోస్టుమార్టం జరగ లేదు. రాత్రాంతా పోలీసుల పహారాలో వివేక్ మృతదేహం పోస్టుమార్టం గదిలోనే నిలిచిపోయింది. బుధవారం ఉదయం బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు పోస్టుమార్టం గది వద్దకు వచ్చి విద్యార్థి వివేక్ తల్లితండ్రులను ఓదార్చారు. గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయుల నిర్లక్ష్యమే విద్యార్థి మృతికి కారణమని వారిపై కేసుమోదు చేసి న్యాయవిచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. దీంతో మధ్యాహ్నం వరకు కూడా వివేక్ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించలేదు. సీఐ శ్రీనివాస్, ఎస్ లక్ష్మారెడ్డి వివేక్ తల్లితండ్రులతో మాట్లాడి విద్యార్థి మృతిపై నిస్పక్షపాతంగా విచారణ చేపడతామని మీకు అనుమానం ఉన్న వారిపై దరఖాస్తు ఇస్తే పోస్టుమార్టం అనంతరం వచ్చిన రిపోర్టు ఆధారంగా నిందుతులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని సీఐ పేర్కొన్నారు. దీంతో వివేక్ తల్లితండ్రులు తన కుమారుడిని ఆసుపత్రికి తీసుకు వచ్చిన ఉపాధ్యాయులతో పాటు పాఠశాలలో ఉన్న విద్యార్థులు, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయుల పై కేసునమోదు చేయాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివేక్ తల్లితండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానస్పద మృతి కింద కేసునమోదు చేసినట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు. విద్యార్థి మృతిచెందిన 24 గంటల అనంతరం వివేక్ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. పోస్టుమార్టం అనంతరం విద్యార్థి మృతదేహాన్ని సిద్దిపేట ఆసుపత్రి నుంచి తెప్పించి పార్థీవ వాహనంలో వివేక్ స్వగ్రామం నంగునూర్‌కు తరలించారు.

నంగనూర్‌లో పాఠశాలలు బంద్

నంగునూరు, అక్టోబర్ 8 (ఆంధ్రజ్యోతి): జిల్లెల్లగడ్డ గురుకుల పాఠశాలలో అనుమానస్పద స్థితిలో మృతి చెందిన విద్యార్థి సనాదుల వివేక్ (13) అంత్యక్రియలు నంగునూరులో బుధవారం ముగిశాయి. హుస్నాబాద్ ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహం గ్రామానికి చేరుకోగానే స్థానిక నాయకులు, యువకులు, విద్యార్థులు వివేక్ మృతదేహానికి నివాళులర్పించారు. తల్లి లావణ్య, తండ్రి సత్యనారాయణను ఓదార్చి అంత్యక్రియలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థి కుటుంబానికి సంఘీభావం తెలుపుతూ సంగునూరు లోని ఉన్నత ప్రాథమిక పాఠశాల. అక్కెనపల్లి మోడల్ స్కూల్ విద్యార్థులు తరగతులు బహిష్కరించారు. వివేక్ మృతదేహానికి నివాళులర్పించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలన్నారు.

కారులో లిఫ్ట్ ఇచ్చారు..

● బెదిరించి డబ్బులు లాక్కున్నారు

నర్సాపూర్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): కారులో లిఫ్ట్ ఇచ్చారు కదా అని ఎక్కిన వారిని మధ్యలో కారులోనే బెదిరించి వారిపై దాడి చేశారు. వారి వద్ద ఉన్న డబ్బులతో పాటు ఫోన్ పే ద్వారా అకౌంట్‌లో ఉన్న వాటిని కూడా వేయించుకుని మధ్యలోనే దింపేసి ఉడాయించిన ఘటన నర్సాపూర్ పరిధిలో చోటు చేసుకుంది. బుధవారం సాయంత్రం ఎస్సై రంజిత్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణపేట జిల్లాకు చెందిన దామరగిద్దకు చెందిన గొర్లకాపరులు నర్సింహా, బాలప్ప గొర్రెలు మేపుకుంటూ నర్సాపూర్‌కు మంగళవారం సాయంత్రం వచ్చారు. ఓ రైసుమిల్లు వద్ద తమ గొర్రెలను ఉంచి గొర్రెలకు అవసరమైన వాటిని కొనుగోలు చేద్దామని మెదక్ వెళ్లడానికి నర్సాపూర్ ప్రధాన చౌరస్తా వద్దకు వచ్చారు. అదే సమయంలో సంగారెడ్డి నుంచి బ్లాకలర్ కార్‌లో వచ్చిన వారు నిలబడ్డ వీరిని ఎక్కడకు వెళ్లాలని అడగ్గా మెదక్ అని చెప్పగా మేము అక్కడికే వెలుతున్నామని ఎక్కండి అని ఎక్కించుకున్నారు. అయితే కారులో వెళ్తున్న క్రమంలో కారులో వచ్చిన వారు ఎక్కిన ఇద్దరిని మీ వద్ద ఉన్న డబ్బు ఇవ్వండి లేకుంటే చంపుతామంటూ కొట్టడం చేశారు. దీంతో భయపడి నర్సింహా వద్ద ఉన్న ఐదువందలు ఇవ్వగా అతడి ఫోన్ లాగుకుని ఫోన్‌పే అకౌంట్ ద్వారా తమ అకౌంట్‌లో ఉన్న వేయి రూపాయలు కూడా వేయించుకున్నారు. బాలప్ప వద్ద ఉన్న ఫోన్‌ను కూడా తీసుకుని అదేవిధంగా ఫోన్‌పే ద్వారా అకౌంట్‌లో ఉన్న రూ.4500లు వారి అకౌంట్‌లో వేయించుకుని కౌడిపల్లి మండలం వెంకట్రావ్‌పేట సమీపంలో వదిలేసి ఉడాయించారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన బాధితులు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఇదే కారులో వచ్చిన వారు నర్సాపూర్-సంగారెడ్డి మార్గంలో కూడా ఓ స్కూటీపై వచ్చిన వ్యక్తిని కూడా బెదిరించి అతడి వద్ద నుంచి కూడా డబ్బులు వసూలు చేసినట్లు తెలిసింది.

పాడి గేదెల మృతిపై అధికారుల విచారణ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నారాయణఖేడ్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ఇరవై పాడి గేదేల మృతి సకాలంలో వ్యాక్సినేషన్ చేయక పోవడంతో అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో ఈనెల 6న ప్రచురితమైన వార్త కథనానికి స్పందించిన పశు సంవర్ధక శాఖ అధికారులు బుధవారం విచారణ చేపట్టారు. సంగారెడ్డి ఏడీ పవన్‌కుమార్, నారాయణఖేడ్ ఏడీ గంగాధర్, పశువైద్యాధికారి గ్రామంలో పాడి గేదేలు, పశువుల రక్తపు నమోనాలు సేకరించారు.

బాలుడి కిడ్నాప్ కలకలం

జోగిపేట రూరల్, అక్టోబరు8 (ఆంధ్రజ్యోతి): బాలుడి కిడ్నాప్ స్థానికంగా కలకలం రేపింది. ఈ ఘటన అందోల్ మండల పరిధిలోని తాడ్మనూర్ గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై పాండు తెలిపిన వివరాలు... కర్ణాటకు చెందిన బాలుడి తల్లి భర్తతో గొడవ పడి తన సోదరుడైన మరాఠా రాజు వద్ద ఉంటోంది. ఆమెకు పవన్ అనే కుమారుడు ఉన్నాడు. బుధవారం సాయంత్రం 4 గంటల సమయంలో గుర్తుతెలియని ఇద్దరు దుండగులు ద్విచక్ర వాహనంపై వచ్చి బాలుడిని ఎత్తుకెళ్లి నట్లు మరఠా రాజు జోగిపేట పోలిస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్సై పాండు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు నిర్వహిస్తునట్లు తెలిపారు.



పవన్ (ఫైల్)

మద్యం తాగించలేదని వ్యక్తిపై దాడి

కుకునూరుపల్లి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి):తమకు మద్యం తాగిపించలేదని ఓ వ్యక్తిపై ఇద్దరు యువకులు దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. లకుడారం గ్రామానికి చెందిన ఈగ రాజు సోమవారం రాత్రి నడుచుకుంటూ తన ఇంటికి వెళ్తుండగా మార్గం మధ్యలో అదే గ్రామానికి చెందిన బైండ్ల వినయ్, రాచకొండ మధు ఇద్దరి యువకులు తమకు మద్యం తాగిపించాలని అతనిని బెదిరించారు. రాజు ఈరోజు నా వద్ద డబ్బులు లేవని రేపు తాగిపిస్తానని నచ్చజెప్పి ప్రయత్నం చేశాడు. దీంతో ఆగ్రహించిన ఇద్దరు యువకులు రాజుని విచక్షణారహితంగా అతడిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. ఈ విషయం ఎవరికైనా చెబితే చంపేస్తామని బెదిరించారు. భయంతో తీవ్ర గాయాలతో కుటుంబ సభ్యులకు విషయం చెప్పకుండా మంగళవారం మధ్యాహ్నం వరకు నిద్రిస్తూ ఉండడంతో కుటుంబ సభ్యులు గమనించి ఏమైందని ఆరా తీయడంతో జరిగిన విషయం చెప్పాడు. దీంతో వారు పోలీస్ స్టేషన్‌కి వెళ్లి ఫిర్యాదు చేయడంతో ఇద్దరి యువకులపై కేసు నమోదు అయిందని దాడికి పాల్పడ్డ యువకులు పరారీలో ఉన్నారని పోలీసులు తెలిపారు. ఇదిలా ఉంటే దాడి చేసిన ఇద్దరు యువకులు గతంలో గ్రామంలోనే కాకుండా ఇతర గ్రామాలలో పలు నేరాలకు పాల్పడి నిందితులుగా ఉన్నారు. మరో మారు వ్యక్తిపై దాడి చేసి తీవ్రంగా గాయపరచడంతో గ్రామ యువకులు, ప్రజలు మంగళవారం రాత్రి యువకుల ఇళ్ల వద్దకు వెళ్లి ఆందోళన చేసి రాచకొండ మధును చితక బాదారు. బుధవారం ఉదయం గ్రామస్థులందరూ పోలీస్ స్టేషన్ కి వచ్చి ఇద్దరి యువకులను కఠినంగా శిక్షించాలని ఫిర్యాదు చేశారు.

బెల్ట్ షాప్‌లో టాస్క్‌ఫోర్స్ అధికారుల దాడి

మనోహరాబాద్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా బెల్ట్‌షాప్‌లో మద్యం విక్రయిస్తున్నారన్న సమచారంతో జిల్లా టాస్క్ ఫోర్స్ పోలీసుల దాడి చేసి మద్యం పట్టుకున్న ఘటన మండల పరిదిలో చోటు చేసుకుంది. మనోహరాబాద్ మండల పరిదిలోని కాళ్లకల్ గ్రామంలోని ప్రభాకర్ గౌడ్‌కు చెందిన బెల్ట్ షాపులో జిల్లా ఎస్పీ శ్రీనివాస్‌రావు ఆదేశాల మేరకు మెదక్ జిల్లా టాస్క్ ఫోర్స్ పోలీసులు బెల్ట్ షాప్‌పై దాడి చేశారు. దీంతో బెల్ట్ షాప్‌లో సుమారు 150 లీటర్ల వరకు మద్యాన్ని పట్టుకున్నారు. స్వాధీనం చేసిన మద్యాన్ని, నిందితుడిని మనోహరాబాద్ పోలీస్ స్టేషన్‌లో అప్పగించి, తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టారు.

పాఠశాలలో విద్యుత్ వైర్ల చోరీ

మనూరు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): మనూరు మండలం రాయిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కొందరు ఆకతాయిలు మంగళవారం రాత్రి విద్యుత్ వైర్లు చోరీ చేయడమే కాకుండా, ఫ్యాన్లు ధ్వంసం చేసి, నీళ్లు తాగే కుళాయిలను ధ్వంసం చేశారు. ఈ విషయాన్ని గుర్తించిన గ్రామస్థులు బుధవారం మనూరు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు పాఠశాలను తనిఖీ చేసి విచారణ జరిపారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ గతంలో కూడా పాఠశాల ఆవరణలో మందు తాగి సీసాలను పగుల గొట్టి పాఠశాలలో అసాంఘీక కార్యక్రమాలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై విచారణ జరిపి వెంటనే చర్యలు తీసుకోవాలని వారు పోలీసులను కోరారు.

బ్యాగును తిరిగి అప్పగించిన ఆర్టీసీ సిబ్బంది

హుస్నాబాద్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ బస్సులో ఓ మహిళ మరచిపోయిన బ్యాగును తిరిగి అప్పగించి డ్రైవర్, కండక్టర్ శభాష్ అనిపించుకున్నారు. బుధవారం సిద్దిపేట డిపోకు చెందిన బస్సు ఎక్కిన శోభారాణి నాలుగు తులాల బంగారు గొలుసు, బట్టలతో కూడిన బ్యాగును బస్సులోనే మరచిపోయి హనుమకొండలో దిగింది. బస్సులో బ్యాగు మరచిపోవడాన్ని గమనించి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. వెంటనే వారు ఫోన్ ద్వారా ఆర్టీసీ అధికారులకు సమాచారం అందించి బస్సు వివరాలను తెలుసుకున్నారు. బస్సు డ్రైవర్ మల్లయ్య, కండక్టర్ శంకర్‌లకు విషయం తెలిపి బ్యాగును హుస్నాబాద్ బస్టాండ్‌లో స్వాధీనం చేసుకొని మహిళకు తిరిగి అప్పగించారు. విలువైన బ్యాగును అందించినందుకు మహిళా ఆర్టీసీ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపింది.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

నిజాంపేట, అక్టోబర్ 8 (ఆంధ్రజ్యోతి): కూలి పనులకు వెళ్తున్న ఓ యువకుడిని రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు కబళించింది. మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం ఈ విషాద ఘటన జరిగింది. కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా నిజాంపేట మండల కేంద్రానికి చెందిన కొమ్మాట ఎల్లం (28) కొద్ది రోజులుగా మేడ్చల్ ప్రాంతంలో కూలి పనులు చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. పనికి వెళ్తున్న సమయంలో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై మేడ్చల్ పోలీసులు కేసు నమోదు చేసి నిజాంపేట పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించారు.

బైక్ దొంగ..

మనోహరాబాద్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): బైక్ దొంగతానికి వచ్చిన వ్యక్తిపై పెట్రోల్ పోయడంతో తీవ్ర గాయాలు కాగా ఐదు రోజులుగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. చేగుంట ఎస్సై చైతన్యకుమార్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 3న చిన్న శంకరంపేట మండలం జంగారాయి గ్రామానికి చెందిన మోహన్, మైపాల్ బైక్ దొంగతనానికి చేగుంట మండలం వడియారం వచ్చారు. దీంతో గ్రామాస్థులు పట్టుకుని పెట్రోలు ఒంటిపై పోసి అంటించడంతో తీవ్ర గాయాలయ్యాయి. బందెల మోహన్ అలియాస్ (హేవాన్)(32) వేంటనే గాంధీ ఆస్పత్రికి తరలించారు. దీంతో 5 రోజుల తరువాత చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు.

ఇంటికి వెళ్లేందుకు దారి ఇవ్వడం లేదని..

● పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య


హవేళిఘణపూర్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి); ఇంటికి వెళ్లేందుకు దారి ఇవ్వడంలేదని మనస్తాపంతో ఓ యువకుడు ఆత్మహత్యాయత్నం చేశాడు. అతడు చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మండలంలోని వాడి గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. కుటబీకులు, పోలీసుల కథనం ప్రకారం.. వాడి గ్రామానికి చెందిన గుడుపల్లి సుభాష్ రెడ్డి (44) వ్యవసాయం చేస్తుంటాడు. సుభాష్ తన ఇంటికి వెళ్లేందుకు దారి లేదని తీవ్ర మనోవేదనకు గురై ఈ నెల 3న తమ పౌల్ట్రీ ఫాం వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. అంతకు ముందు తనకు జరిగిన అన్యాయం గురించి వాయిస్ రికార్డు చేసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. ఈ రికార్డులో తన ఇంటికి వెళ్లడానికి దారి గొడవ జరుగుతుందని దీని గురించి గ్రామస్థులకు, అధికారులకు విన్నవించినా ఫలితం లేదని నా చావుతో నైనా నాఇంటికి దారి ఇవ్వాలని పేర్కొన్నారు. దీన్ని చూసిన సన్నిహితులు బాధితుడిని హాస్పిటల్‌కు తరిలించారు. హైదరాబాద్‌లోని గాంధీ హాస్పిటల్‌లో నాలుగు రోజుల పాటు చికిత్సపొందుతూ మరణించాడు. మృతుడి భార్య అనూష ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేష్ తెలిపారు. దారికి ఇవ్వక పోవడం వల్లే సుభాష్ రెడ్డి మృతి చెందాడని ఆగ్రహించిన గ్రామస్థులు, బంధువులు మహేందర్ ఇంటికి దారిని ఏర్పాటు చేశారు.

అప్పుల బాధతో వ్యక్తి ..

హుస్నాబాద్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ పట్టణంలోని హనుమాన్‌నగర్‌కు చెందిన జొన్నగడ్ల నర్సయ్య (44) అప్పుల బాధ భరించలేక బుధవారం సాయంత్రం ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం కూలి పని చేసుకొని జీవించే నర్సయ్య ఇటీవల కొత్త ఇంటిని నిర్మించుకున్నాడు. ఇందుకు రూ. 8 నుంచి 10 లక్షల వరకు ప్రైవేట్ ఫైనాన్సులు, పలువురు వద్ద అప్పులు చేశారు. ఎకరం వ్యవసాయ భూమి ఉండగా అందులో ఆశించిన మేర పంట రాలేదు. దీంతో అప్పుల బాధ భరించలేక ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు.

గృహిణి అదృశ్యం

పటాన్‌చెరు అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): గృహిణి అదృశ్యం అయిన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యప్రదేశ్ రాష్ట్రం జబల్‌పూర్ జిల్లా రాంజీ గ్రామానికి చెందిన అతుల్‌చోక్స్, ధ్రతిమంజిలు ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. ప్రైవేట్ పరిశ్రమలో అతుల్‌చోక్స్ సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు. ఈనెల 4న డ్యూటీకి వెళ్లాడు. మధ్యాహ్నం తను ఇంటి నుంచి వెళ్లిపోతున్నానంటూ భార్య ధ్రతిమంజి భర్తకు ఫోన్ చేసి చెప్పి ఫోన్ స్విచ్చాఫ్ చేసింది. చుట్టుపక్కల విచారించినా ఫలితం లేకపోవడంతో అతుల్‌చోక్స్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.



ధ్రతి మంజి (ఫైల్)

ఇందిరమ్మ ఇళ్లకు ధరాఘాతం



లబ్ధిదారులపై అదనపు భారం.. అప్పు చేసి నిర్మాణం

- వేధిస్తున్న ఇసుక కొరత.. ధర పెంపు
- ఇటుక, సిమెంట్, కంకర ప్రియమే..
- ప్రభుత్వమిచ్చే రూ.5లక్షలు సరిపోని వైనం
- రూ.3 నుంచి 5 లక్షలు అదనంగా వ్యయం
- అప్పులపాలవుతున్న లబ్ధిదారులు



బర్డీపూర్‌లో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల పనులు

ఝరాసంగం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు సొంతింటి కలను సాకారం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పథకానికి మార్కెట్ ధరలు, వర్షాల రూపంలో గట్టి ఎదురుదెబ్బ తగులుతోంది. ఇంటి నిర్మాణానికి అత్యంత కీలకం అయిన ఇసుక ధరలు అమాంతం రెండింతలు పెరగడంతో లబ్ధిదారులపై నిర్మాణ భారం భారీగా పడింది. ఫలితంగా ఇళ్ల నిర్మాణాలు మందకొడిగా సాగుతున్నాయి. మండలంలో మొత్తం 583 ఇందిరమ్మ ఇళ్ల మంజూరవగా, ఇప్పటివరకు 383 ఇళ్ల గ్రౌండింగ్ అయ్యాయి. ఇందులో 230 బేస్‌మెంట్ స్థాయిలో, 50 రూఫ్ లెవెల్‌లో, 19 స్లాబ్ వరకు పూర్తయ్యాయి. అయితే, మార్కెట్‌లో ఇసుక, కంకర, మేస్త్రీల కూలి ధరలు అధికం కావడంతో ప్రభుత్వం ఇస్తున్న రూ.5లక్షలు ఏమాత్రం సరిపోవడం లేదని, అదనపు వ్యయం కోసం వడ్డీలకు అప్పులు చేయాల్సిన దుస్థితి ఏర్పడిందని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇసుక కొరతతో పనులకు ఆటంకం

ఇంటి నిర్మాణం సజావుగా సాగాలంటే ఇసుక అత్యవసరం. ప్రస్తుత వర్షాల కారణంగా ఇసుక మార్కెట్‌లో తీవ్ర కొరత ఏర్పడింది. దీంతో వ్యాపారులు ధరలను ఇష్టానుసారంగా పెంచేశారు. గతంలో లారీ ఇసుక (30-40 టన్నులు) రూ.40 వేల నుంచి రూ.45 వేలలో ఇంటి వద్దకు సరఫరా అయ్యేది. కానీ, ప్రస్తుతం వర్షాల కారణంగా టన్ను ఇసుక ధర రూ.2,100 నుంచి రూ.2,500 వరకు పలుకుతోంది. దీంతో లారీ ఇసుక కోసం లబ్ధిదారులు సుమారు రూ.లక్ష వరకు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇంత పెద్ద మొత్తంలో పెట్టుబడి పెట్టలేక చాలా మంది లబ్ధిదారులు నిర్మాణ పనులను నెమ్మదిగా చేపట్టారు.

ఇతర సామగ్రి ధరలూ అధికమే

ఇసుకతో పాటు ఇతర నిర్మాణ సామగ్రి ధరలు కూడా పెరిగాయి. 100 ఫీట్ల కంకర ట్రాక్టర్ గతంలో రూ.3,500 ఉండగా, ఇప్పుడు రూ.5 వేలకు విక్రయిస్తున్నారు. మేస్త్రీల కూలి ధరలు కూడా గణనీయంగా పెరగడంతో కేవలం కూలీలకు, మేస్త్రీలకే సుమారు రూ.2.60 లక్షలు ఖర్చవుతోందని లబ్ధిదారులు వాపోతున్నారు.

అప్పు చేసి ఇల్లు కట్టుకుంటున్న పేదలు

లబ్ధిదారుల్లో అత్యధికులు పేద, మధ్య తరగతి ప్రజలే. 400 నుంచి 600 చదరపు అడుగుల్లోనే ఇందిరమ్మ ఇంటిని నిర్మించుకోవాలనే నిబంధన ఉన్నప్పటికీ, ప్రభుత్వం ఇచ్చే రూ.5లక్షలతో ఇల్లు పూర్తి కావడం లేదు. సామాగ్రి ధరల పెరుగుదల కారణంగా లబ్ధిదారులు అదనంగా రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు వ్యయం చేయాల్సి వస్తోంది. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో అప్పులు చేసి ఇంటి నిర్మాణాలు కొనసాగిస్తున్నారు.

అధికారులు ఏమంటున్నారంటే..

ప్రభుత్వం ఇస్తున్న రూ.5 లక్షలు నివసించేందుకు సరిపడా ఇంటి నిర్మాణంకు సరిపోతాయని అధికారులు సూచిస్తున్నారు. అదనపు వసతుల పేరుతో లబ్ధిదారులు అప్పులపాలు కావద్దని వారు హితవు పలుకుతున్నారు. అయితే, లబ్ధిదారులు మాత్రం ప్రభుత్వ ఇసుక సరఫరా చేస్తామని చెప్పినా ఇప్పటివరకు రాలేదని, కేవలం బేస్‌మెంట్ బిల్లు మాత్రమే వచ్చిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రెండింతలు ఖర్చు అవుతుంది...



ఇంటి నిర్మాణానికి అవసరమైన ఇసుక, కంకర, సిమెంట్ ధరలు మార్కెట్‌లో బాగా పెరిగాయి. దీంతో నిర్మాణానికి రెండింతలు ఖర్చు అవుతోంది. ఇసుక ధర రెండింతలు పెరిగింది. ప్రభుత్వం ఇస్తామని చెప్పిన ఇసుక ఇప్పటికీ రాలేదు. ఇప్పటివరకు మాకు బేస్‌మెంట్ బిల్లు మాత్రమే వచ్చింది.

- వెంకన్న,లబ్ధిదారుడు, బర్డీపూర్

'సింగూరు'కు ఆగని వరద

- ఇన్ ఫ్లో 30,410.. ఔట్ ఫ్లో 38,610 క్యూసెక్కులు
- నాలుగు క్రస్ట్ గేట్ల ద్వారా దిగువకు నీటి విడుదల

పుల్‌కల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): సింగూరు ప్రాజెక్టుకు ఎగువన కర్ణాటక, మహారాష్ట్రతో పాటు జిల్లాలో కురిసిన భారీ వర్షాలకు వరద ప్రవాహం వచ్చి చేరుతూనే ఉన్నది. దాదాపు రెండు నెలలుగా వరద పోటెత్తుతూనే ఉన్నది. ఎగువ నుంచి వరద ప్రవాహం ఏ మాత్రం తగ్గడం లేదు. నాలుగు రోజుల క్రితం వరద తగ్గినట్లే తగ్గి మళ్లీ పెరిగింది. దీంతో నాలుగు క్రస్ట్ గేట్లను ఎత్తి వచ్చిన వరదను వచ్చినట్లుగా దిగువకు వదులుతున్నారు. ఈ గేట్ల ద్వారా 35,750 క్యూసెక్కులు, జల విద్యుత్ ఉత్పత్తి గేట్ గుండా 2,200, ఎడమ కాలువకు 120, హెచ్‌ఎండబ్ల్యూఎస్‌కు 80, మిషన్ భగీరథకు 70, ఆవిరి అవుతున్నది 390 , మొత్తం ఔట్ ఫ్లో 38,610 క్యూసెక్కులు నమోదయింది. బుధవారం రాత్రి అందిన సమాచారం మేరకు ప్రాజెక్టులో 520.875 మీటర్లకు 17.791 టీఎంసీల నీటి నిల్వలున్నాయి. సింగూరు ప్రాజెక్టు నుంచి వరద ప్రవాహం అధికంగా ఉండటంతో దిగువన ఉన్న మంజీర జలాశయం మూడు క్రస్ట్ గేట్లను ఐదు మీటర్లు ఎత్తారు. వచ్చిన నీటిని వచ్చినట్లుగానే దిగువన ఘనపురం ప్రాజెక్టుకు వదులుతున్నారు.

ఆర్టీసీ దసరా వేడుకల లక్కీ డ్రా

- విజేతలకు నగదు బహుమతుల ప్రదానం



లక్కీ డ్రా తీస్తున్న సీఐ రమేశ్

సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని ఆర్టీసీ ఆర్ఎం కార్యాలయంలో బుధవారం దసరా వేడుకల లక్కీ డ్రా నిర్వహించారు. దసరా సందర్భంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించిన ప్రయాణికుల టికెట్‌లను గత నెల 27వ తేదీ నుంచి ఈ నెల 6వ తేదీ వరకు ఆయా బస్‌స్టేషన్లలో ఏర్పాటు చేసిన డ్రాప్ బాక్స్‌లో వేసిన విషయం తెలిసిందే. పట్టణ సీఐ రమేశ్ హాజరై ఆ టికెట్లకు సంబంధించి లక్కీ డ్రాను ఓపెన్ చేశారు. ఇందులో విజేతలుగా నిలిచిన హైదరాబాద్‌కు చెందిన రాజేశ్వరికి ప్రథమ బహుమతిగా రూ.25 వేలు, ద్వితీయ బహుమతిగా హైదరాబాద్‌కు చెందిన సర్వత సయ్యద్‌కు రూ.15 వేల నగదు, తృతీయ బహుమతిగా పటాన్‌చెరుకు చెందిన గంగిశెట్టి కోటేశ్వరరావుకు రూ.10 వేల నగదు అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్ ఎస్‌వీజీ కృష్ణమూర్తి, సంగారెడ్డి డిపో మేనేజర్ ఉపేందర్, పీవో అనిత, ఎంఎఫ్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆ ఇద్దరికి ఇందిరమ్మ ఇళ్లు

- ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

దుబ్బాక, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఇళ్లు కూలిపోయే స్థితిలో ఉన్నా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయకపోవడంపై ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి స్పందన లభించింది. దుబ్బాక మండలం పద్మశాలి గడ్డ గ్రామంలోని చెరుకు ప్రవీణ, చెరుకు పద్మ కూలిపోతున్న ఇండ్లలో టార్పాలిన్ కాగితాలు కప్పుకుని బిక్కుబిక్కుమంటూ నివాసముంటున్నారు. వీరికి అత్యవసర జాబితాలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని గ్రామస్థులు, నాయకులు ప్రతిపాదించినా జిల్లా అధికారులు కనికరించలేదు. ఈ విషయమై బుధవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'ఇందిరమ్మా.. ఇదేనా న్యాయం?' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన కాంగ్రెస్ పార్టీ దుబ్బాక ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి ఈ కథనాన్ని కలెక్టర్ హైమావతి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో పదిహేను రోజుల్లో రెండవ జాబితాలో అత్యవసర ప్రాధాన్యత కింద వారికి ఇళ్లు మంజూరు చేయనున్నట్టు కలెక్టర్ హామీనిచ్చారని ఆయన తెలిపారు. వారం రోజుల్లో మరో ఏడుగురు లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నామని, వారితో పాటు వీరిద్దరి పేర్లను కూడా మంజూరు జాబితాలో చేర్చుతామని చెప్పినట్లు తెలిపారు.

ఎన్నికల విధుల్లో సమయపాలన కీలకం

- సంగారెడ్డి అదనపు కలెక్టర్ చంద్రశేఖర్



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

సంగారెడ్డి టౌన్/నాగల్‌గిద్ద/మనూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల విధులు నిర్వర్తించే సిబ్బంది సమయపాలన పాటించడం కీలకమని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ అన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల స్టేజ్-1 రిటర్నింగ్ అధికారులకు నామినేషన్ల ప్రక్రియపై బుధవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అదేవిధంగా నాగల్‌గిద్ద, మనూరు ఎంపీడీవో కార్యాలయాలను సందర్శించి అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో జరగబోయే గ్రామ పంచాయతీ ఎన్నికలు రెండు దశల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ల ప్రక్రియలో సిబ్బంది సమయపాలన కీలకమైన అంశంగా పరిగణించాలన్నారు. రిటర్నింగ్ అధికారులు ఎన్నికల నియమావళిని తూచా తప్పకుండా పాటించాలన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనలు, పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ ప్రక్రియకు తగిన ఏర్పాట్ల పరిశీలన, పోలింగ్ కేంద్రాల వారీగా ఓటర్ల జాబితా సిద్ధం చేయడం, సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలకు సంబంధించి పోలింగ్ రోజున జరిగే ఓట్ల లెక్కింపు ప్రక్రియకు ప్రత్యేక ఏర్పాట్లు చేయడం రిటర్నింగ్ అధికారుల విధిగా పర్యవేక్షించాలని సూచించారు. అనంతరం మాస్టర్ ట్రైనర్ కృష్ణ నామినేషన్ల దాఖలు, పరిశీలన, ఉప సంహరణ, బ్యాలెట్ పేపర్ల తయారీ తదితర అంశాలపై రిటర్నింగ్ అధికారులకు అవగాహన కల్పించారు. డీపీవో సాయిబాబా, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రామాచారి, తహసీల్దార్ శివకృష్ణ, ఎంపీడీవోలు మహేశ్వర్‌రావు, చంద్రశేఖర్, ఏవో మహేష్ చౌహాన్, ఎంపీవో హైమద్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ఐడీఎస్‌ఎంటీ బాధితులను ఆదుకోవాలి

- జాగో తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రాములునేత



ముస్సిపల్ కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న బాధితులు, నాయకులు

జహీరాబాద్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : జహీరాబాద్ పట్టణంలో వివాదాస్పదంగా మారిన ఐడీఎస్‌ఎంటీ ప్లాట్ల బాధితులను ఆదుకోవాలని జాగో తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రాములునేత పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు, నాయకుల తప్పిదాలవల్లే ప్లాట్లను కొనుగోలు చేసిన బాధితులకు అన్యాయం జరుగుతుందన్నారు. ఐడీఎస్‌ఎంటీలో కొంతభాగం ప్రైవేటు వ్యక్తులకు చెందినదిగా అధికారులు గుర్తించకపోవడం ఏమిటని ప్రశ్నించారు. దశాబ్దాల క్రితం అధికారులు, నాయకులు కలిసి ప్రజలవద్ద కొంత నగదును తీసుకుని రిజిస్ట్రేషన్లు చేసి ప్లాట్లను కేటాయించడం ఎంతవరకు కరెక్ట్ అన్నారు. అధికారులకు, నాయకులకు భూమి ప్రభుత్వానిదేనని స్పష్టమైన వివరాలు తెలిశాకే ప్రజలకు విక్రయిస్తే బాగుండేదన్నారు. ప్రభుత్వం అవకాశం కల్పించింది కదా అని భావించి ఆశతో అప్పట్లో ఆస్తులను అమ్ముకుని ప్లాట్లను తీసుకోవాల్సి వచ్చిందన్నారు. కొందరు ప్రైవేటు వ్యక్తులు ఐడీఎస్‌ఎంటీలో కొంతభాగం తమదంటూ అందులో రోడ్లను, పైపులైన్లను ధ్వంసం చేయడాన్ని ఆయన తప్పుబట్టారు. బాధితులకు ప్రభుత్వం, పాలకులు, అధికారులు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్లాట్లను కొనుగోలు చేసిన బాధితులు, ప్రజలు, నాయకులు పాల్గొన్నారు.

రోడ్లు ఛిద్రం.. వంతెనలు శిథిలం

- గంగాపూర్-ర్యాకల్ మధ్య ప్రమాదకరంగా వాగు వంతెన
- భారీ వాహనాలకు దారి మూసివేత
- రోడ్లపై మోకాలు లోతు గుంతలతో ప్రయాణం నరకం



సంజీవనరావుపేట, నాగ్‌ధర్ క్రాస్‌రోడ్స్ వరకు రోడ్డు దుస్థితి

నారాయణఖేడ్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): : నారాయణఖేడ్ నియోజకవర్గంలో ఇటీవల కురిసిన కుండపోత వర్షాలకు రోడ్లు, వంతెనలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఖేడ్ మండలం గంగాపూర్-ర్యాకల్‌ల మధ్య ఉన్న వాగు వంతెన ప్రమాదకరంగా మారింది. ఈ వంతెనపై భారీ వాహనాలు వెళ్తే కూలిపోయే పరిస్థితి ఉండడంతో అధికారులు అప్రమత్తమై, భారీ వాహనాల రాకపోకలను నిలిపివేశారు. దీనికి తోడు, నారాయణఖేడ్ సమీపంలోని మన్సూర్‌పూర్ వాగుపై ఉన్న వంతెన, అలాగే మాద్వార్ వంతెనలు కూడా శిథిలావస్థకు చేరుకోవడం ఆందోళన కలిగిస్తోంది. ఖాంజీపూర్ సమీపంలోని వంతెన నిర్మాణం అసంపూర్తిగా వదిలివేయడంతో ప్రయాణం మరింత కష్టతరంగా మారింది. వర్షాల కారణంగా రోడ్లపై ఏర్పడిన గోతులు వాహన చోదకులకు నరకాన్ని చూపిస్తున్నాయి. నారాయణఖేడ్ నుంచి సిర్గాపూర్ వెళ్లే మార్గంలో అసంపూర్తిగా వదిలేసిన రోడ్డు పనులు వర్షం కారణంగా మరింత అధ్వాన్నంగా తయారయ్యాయి. అత్యంత దారుణంగా మూడు గుంటలు క్రాస్‌రోడ్స్ నుంచి సంజీవనరావుపేట, నాగ్‌ధర్ క్రాస్‌రోడ్స్ వరకు రోడ్డు పూర్తిగా ఛిద్రమైంది. అనేక చోట్ల మోకాలు లోతు గుంతలు ఏర్పడడంతో ఈ రోడ్డుపై ప్రయాణించాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సి వస్తోందని వాహనదారులు వాపోతున్నారు. అధికారులు తక్షణమే స్పందించి, యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేయించాలని ప్రయాణికులు కోరుతున్నారు.



గంగాపూర్-ర్యాకల్ మధ్య ధ్వంసమైన వంతెన



శివ్వంపేటలో 25కోట్లతో నిర్మించిన సంపు

నర్సాపూర్‌కు నీటి గోస

మంజీర పైపులైన్ లీకేజీతో494 గ్రామాలకు నిలిచిన సరఫరా

- శివ్వంపేట సంపు నుంచి నీటిని అందించే వీలున్నా పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు
- ట్యాంకర్లపై ఆధారపడుతున్న ప్రజలు

నర్సాపూర్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : మంజీర నది నుంచి మిషన్ భగీరథ ద్వారా నర్సాపూర్ నియోజకవర్గానికి సరఫరా అయ్యే తాగునీరు ప్రధాన పైపులైన్ లీకేజీల కారణంగా గత కొన్ని రోజులుగా నిలిచిపోయింది. దీంతో నిండుగా వర్షాలు పడుతున్న సమయంలో కూడా నర్సాపూర్ నియోజకవర్గంలోని ఏడు మండలాల ప్రజలకు మంచినీటి గోస తప్పడం లేదు. సమస్యను పరిష్కరించడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు తీవ్ర అలసత్వం వహిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

మంజీర నీటి సరఫరాకు తీవ్ర అంతరాయం

నర్సాపూర్ నియోజకవర్గంలోని నర్సాపూర్, కౌడిపల్లి, చిలప్‌చెడ్, హత్నూర, శివ్వంపేట, వెల్దుర్తి, మాసాయిపేట, కొల్చారం మండలాలతో పాటు పటాన్‌చెరు నియోజకవర్గంలోని కొన్ని గ్రామాలకు మంజీర నదికి సమీపంలో ఉన్న చక్రియాల్ వద్ద ఉన్న ఇంటెక్ వెల్ నుంచి నీరు సరఫరా అవుతుంది. ఈ నీరు హత్నూర మండలం బోర్పట్ల వద్ద ఉన్న ఫిల్టర్ బెడ్‌లో శుద్ధి అయ్యాక మొత్తం 494 గ్రామాలకు మిషన్ భగీరథ ద్వారా అందుతుంది.

ట్యాంకర్లే దిక్కు..

అయితే, ఇటీవల ప్రధాన పైపులైన్లు తరచూ లీకేజీ అవుతుండటంతో నీటి సరఫరాకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. తాజాగా వారం రోజుల క్రితం చక్రియాల్ వద్ద ప్రధాన పైపులైన్ లీకేజీ అయినప్పటికీ, వరద నీటి ప్రవాహం కారణంగా మరమ్మతులు చేయలేకపోయారు. అందుకు మరికొన్ని రోజులు పట్టే అవకాశం ఉండటంతో, ప్రత్యామ్నాయంగా స్థానికంగా ఉన్న బోర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని మిషన్ భగీరథ గ్రిడ్ అధికారులు సూచించారు. దీంతో గ్రామ పంచాయతీల ద్వారా వేసిన బోర్ల నీటిని అందిస్తున్నప్పటికీ, అది ప్రజల తాగునీటి అవసరాలకు ఏమాత్రం సరిపోవడం లేదు. ఫలితంగా, నియోజకవర్గ కేంద్రమైన నర్సాపూర్ పట్టణంలో సహా అనేక గ్రామాల్లో ప్రజలు మంచినీటి కోసం ట్యాంకర్లపై ఆధారపడాల్సిన దుస్థితి ఏర్పడింది.

నిష్ప్రయోజనంగా గోదావరి సంపు

మరోవైపు, నర్సాపూర్ ప్రజలకు తాగునీటి ఇబ్బంది లేకుండా చూసేందుకు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం శివ్వంపేటలో రూ.25 కోట్లతో ఒక ప్రత్యేక సంపును నిర్మించింది. దీనికి గజ్వేల్ నియోజకవర్గం కోమటిబండ నుంచి ప్రత్యేక పైపులైన్ ద్వారా గోదావరి నీటిని తరలించి నిల్వ చేసి, అవసరమైనప్పుడు నియోజకవర్గానికి సరఫరా చేసేలా ఏర్పాటు చేశారు. ప్రస్తుతం మంజీర నీటి సరఫరా పూర్తిగా నిలిచిపోయిన ఈ క్లిష్ట సమయంలో, ఈ సంపును వినియోగించుకునే అవకాశమున్నది. చిన్నచిన్న మరమ్మతులు చేసి గోదావరి నీటిని నియోజకవర్గంలోని గ్రామాలకు అందించే మార్గం ఉన్నప్పటికీ, దాని గురించి అధికారులు, నేతలు ఎవరూ పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. కోట్ల రూపాయల ప్రజాధనంతో నిర్మించిన ఈ సంపు నిష్ప్రయోజనంగా ఉండటం పట్ల స్థానిక ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు తాగునీటి కోసం ఇంతగా ఇబ్బందులు పడుతున్నా, నాయకులు, అధికారులు స్పందించకపోవడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది.



ట్యాంకర్ల ద్వారా తాగు నీటి సరఫరా

న్యూస్ బాక్స్

మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులకు క్యాంపస్ సీట్లు

సిద్దిపేట కల్చరల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): సీపీఈజీటీ ఫలితాల్లో సిద్దిపేట మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు క్యాంపస్ సీట్లు సాధించారు. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బీఎస్సీ పూర్తి చేసిన చండి కంప్యూటర్ సైన్స్‌లో 6వ ర్యాంకు సాధించి ఉస్మానియా విశ్వవిద్యాలయంలో సీటు కైవసం చేసుకుంది. అలాగే కంప్యూటర్ సైన్స్ సబ్జెక్‌లో నితీష 668వ ర్యాంకు, నందిని 719వ ర్యాంకుతో శాతవాహన విశ్వవిద్యాలయ క్యాంపస్ సీట్లు సాధించారు. క్యాంపస్ సీట్లు సాధించడం పట్ల కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి జీవన్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్వేత, అధ్యాపకులు సదరు విద్యార్థులను అభినందించారు.

రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ క్రీడలకు వరికోలు విద్యార్థి

కోహెడ, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని వరుకోలు ఉన్నత పాఠశాలకు చెందిన ముప్పాల కృపాకర్ అనే విద్యార్థి రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో జరుగుతున్న క్రీడలలో భాగంగా, అండర్ -14 ఫుట్‌బాల్ పోటీలకు ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి రాష్ట్ర స్థాయిలో ఎంపికైనట్టు ప్రధానోపాధ్యాయురాలు డి కృష్ణవేణి తెలిపారు. బుధవారం పాఠశాలలో ఉపాధ్యాయులు కృపాకర్‌ను అభినందించారు.

సీజేఐపై దాడిని ఖండిస్తూ సీపీఎం నిరసన

సిద్దిపేట అర్బన్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్ పై దాడిని ఖండిస్తూ బుధవారం సాయంత్రం సీపీఎం ఆధ్వర్యంలో సిద్దిపేటలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి మాట్లాడుతూ సంఘ్ పరివార్ వ్యాప్తిచేసిన విద్వేషానికి ప్రతిబింబమే ఈ సంఘటన అని అన్నారు. దీనిని ప్రజలు, ప్రజాతంత్ర, లౌకికవాదులు తీవ్రంగా ఖండించాలన్నారు. ఈ ఘటన ప్రజాస్వామ్యం పై దాడిగా అభివర్ణించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కాముని గోపాలస్వామి, రాళ్ల బండి శశిధర్,సందబోయిన ఎల్లయ్య జిల్లా కమిటీ సభ్యులు జాలిగపు శిరీష, దాసరి ప్రశాంత్, ఆముదాల రంజిత్ రెడ్డి, తాటోజు రవీంద్రచారి,కొండం సంజీవ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

● **మిరుదొడ్డి:** మతోన్మాద శక్తులు చీఫ్ జస్టిస్ గవాయ్‌పై దాడికి యత్నించడం హేయమైన చర్య అని జాతీయ మాలమహానాడు పోలిట్‌బ్యూరో చైర్మన్ ర్యాకం శ్రీరాములు ఖండించారు. బుధవారం మండల కేంద్రమైన అక్బర్‌పేట-భూంపల్లిలో ఆయన మాట్లాడారు నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

పంట నష్టానికి పరిహారం అందించాలి

చేర్యాల, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): చేర్యాల మండలం వీరన్నపేట గ్రామ మిదునమ్మ చెరువును నింపడంతో సమీపంలోని సర్వే నెం. 824, 825, 826తో పాటు ఇతర రైతుల పట్టాభూములలో పంటలు నీటమునిగాయని బాధిత రైతులు వాపోయారు. ఈ విషయమై పరిహారం అందించి ఆదుకోవాలని కోరుతూ పలువురు బుధవారం చేర్యాల తహసీల్దారు దిలీప్ నాయక్‌కు వినతిపత్రం అందించారు.

ఎన్నికల నియమావళిపై అవగాహన

మద్దూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలు సజావుగా జరిగేందుకు నాయకులు సహకరించాలని ఎంపీడీవో ఎం. వీరరాజ్ కోరారు. బుధవారం దూళిమిట్ట మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై ఆయా పార్టీల నాయకులతో ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో ఎంపీడీవో మాట్లాడారు. నామినేషన్ వేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటు ఎన్నికల కమిషన్ నియమావళిని ఉల్లంఘించరాదని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రవీణ్‌రెడ్డి, ఎంపీవో మాధవ్ జాదవ్, జోనల్ ఆఫీసర్స్ అంజనేయులు, రమేష్, రిటర్నింగ్ ఆఫీసర్స్ వెంకట్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, జగదీశ్వర్, ఎస్‌ఐ షేక్ మహబూబ్‌అలీతో పాటు పంచాయతీ సెక్రటరీలు, అన్ని పార్టీల నాయకులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి సాయం

కొమురవెల్లి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గౌరాయపల్లి గ్రామంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మాట్ల సాయి కుటుంబ సభ్యులను బుధవారం బీఆర్‌ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బొంగు రాజేందర్‌రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా రూ.5వేల ఆర్థిక సాయాన్ని అందించి, అండగా ఉంటామని హామీనిచ్చారు.

సీపీఐకి స్థానాలను కేటాయించాలి

చేర్యాల, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): కూటమిలో భాగంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో పలు సర్పంచు, ఎంపీటీసీ స్థానాలను సీపీఐకి కేటాయించాలని ఆ పార్టీ జిల్లాకౌన్సిల్ సభ్యుడు ఈరి భూమయ్య పేర్కొన్నారు. బుధవారం చేర్యాలలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు.

బాబోయ్.. ఇదేం కంపు?

● బండపల్లి ప్రభుత్వ మండల పరిషత్ పాఠశాల ఆవరణలో దుర్గంధం
● కాలనీలో అతీ గతీ లేని మురుగు కాలువ
● చిన్నవర్షానికే నివాసాల మురుగు ప్రవాహం నేరుగా పాఠశాలలోకే..
● నిత్యం మురుగు నీటి నుంచే రాకపోకలు




బండపల్లి కాలనీలోని ప్రభుత్వ మండల పరిషత్ పాఠశాల, మురుగునీటి నుంచే నడుచుకుంటూ వస్తున్న విద్యార్థులు



పాఠశాల ఆవరణలో నిల్వ ఉన్న మురుగునీరు

చేర్యాల, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి) : చేర్యాల పట్టణ శివారు బండ పల్లి కాలనీలోని ప్రభుత్వ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో దుర్గంధం వెదజల్లుతున్నది. నిత్యం విద్యార్థులు, ఉపాధ్యాయులతో పాటు అప్పుడప్పుడు పాఠశాలను సందర్శించే అధికారులకు డ్రైనేజీ నీరు స్వాగతం పలుకుతున్నది. తరగతి గదిలోపాఠాలు వింటూ పుస్తకాలు, పలక, బలపం, పెన్ను, పట్టాల్సిన చిన్నారుల చేతులు ముక్కు, నోరు మూసుకునే దుస్థితి నెలకొన్నది. మునిసిపల్ అధికారుల నిర్లక్ష్యానికి విద్యాశాఖ అధికారులు పట్టింపులేతనం తోడు కావడంతో చిన్నారులకు ఆరోగ్యానికి ముప్పు పొంచి ఉందని స్థానికులు మండిపడుతున్నారు.

జనావాసాల మురుగునీరంతా చేరేది ఇక్కడే..

చేర్యాల పట్టణానికి సుమారు 5కిలోమీటర్ల దూరంలో గల బండపల్లి కాలనీలో సుమారు 100ఇళ్లు, 650 జనాభా, 410మంది ఓటర్లు ఉన్నారు. చాలా సంవత్సరాలక్రితమే కాలనీలో మండల పరిషత్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల నెలకొల్పారు. నాటి నుంచి కాలనీకి చెందిన చిన్నారులు అదే పాఠశాలలో చదువుకుంటున్నారు. అలాగే పాఠశాల ఆవరణలోనే అంగన్‌వాడీ కేంద్రం కొనసాగుతుంది. పాఠశాల సమీపంలోని జనావాసాల గుండా డ్రైనేజీ నీటి మళ్లింపు కాలువ అతీ గతీ లేకపోవడంతో చిన్నపాటి వర్షం కురిసినా, ఇళ్లలోనుంచి నీరు ప్రవహించినా నేరుగా పాఠశాల ఆవరణకు చేరుకుంటున్నది.

దుర్వాసనతో సతమతం

పాఠశాల ఆవరణలో రోజుల తరబడిగా మురుగు నీరు నిల్వ ఉండడంతో పరిసరాల్లో దుర్గంధం వెదజల్లుతూ విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. దోమలు విజృంభిస్తుండటంతో వ్యాధులు సోకే ప్రమాదం పొంచిఉన్నదని తల్లిదండ్రులు, స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో నిత్యం ఉదయం, సాయంత్రం వేళల్లో ముక్కు మూసుకుని మురుగునీటిలో నుంచి నడుచుకుంటూ వెళ్లేందుకు విద్యార్థులు తంటాలుపడుతున్నారు.

పట్టించుకోని అధికారులు

డ్రైనేజీ కాలువ నిర్మాణంతో పాటు పాఠశాల ఆవరణకు మురుగునీరు మళ్లించకుండా ప్రత్యామ్నాయచర్యలు తీసుకోవాలని కాలనీవాసులు పలుమార్లు మునిసిపల్ కార్యాలయంలో విన్నవించినా పట్టించుకోకపోవడం గమనార్హం. ఈ విషయమై అధికారులు స్పందించి డ్రైనేజీ కాలువ నిర్మాణం చేపట్టాలని, అదేవిధంగా పాఠశాల ఆవరణలోకి మురుగునీరు చేరకుండా కాలువను మళ్లించాలని విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు కోరుతున్నారు.

పరిసరాల శుభ్రతను సామాజిక బాధ్యతగా తీసుకోవాలి





విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న కమిషనర్ ఆశ్రిత్‌కుమార్

సిద్దిపేట కల్చరల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మన ఇంటితో పాటు పరిసరాలు, పట్టణం పరిశుభ్రంగా ఉండాలనేది సామాజిక బాధ్యతగా తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ సూచించారు. స్వచ్ఛ సర్వేక్షన్ 2025లో భాగంగా బుధవారం సిద్దిపేట పట్టణంలోని క్రాంతి హైస్కూల్‌లో అందరి సహకారంతో చెత్త రహిత పట్టణంగా తీర్చిదిద్దేలా విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంట్లో తడి, పొడి, హానికర చెత్తగా ఎలా వేరు చేయాలో వివరించారు. అలాగే చెత్త బహిరంగ ప్రాంతాల్లో వేయకుండా ఉండేలా విద్యార్థులకు సూచించారు. ప్లాస్టిక్ వలన కలిగే అనర్థాలను వివరించారు. స్వచ్ఛ సిద్దిపేటలో తాము భాగమవుతామని, మేము సైతం శ్రమదానం చేస్తామని క్రాంతి హైస్కూల్ యాజమాన్యం తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం కమిషనర్‌ను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ భగవాన్‌రెడ్డి, స్కూల్ చైర్‌పర్సన్ అర్పితారెడ్డి, ఐటీసీ వావ్ ఫౌండేషన్ ప్రతినిధి తదితరులు పాల్గొన్నారు.

'సే నో టూ డ్రగ్స్' అవగాహన ర్యాలీ



సిద్దిపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

సిద్దిపేట కల్చరల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశలో ఎలాంటి వ్యసనాలకు బానిస కాకుండా క్రమశిక్షణగా చదువుకోవాలని టూ టౌన్ ఎస్ఐ షేక్ అసిఫ్ సూచించారు. మాదక ద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా 'సే నో టూ డ్రగ్స్' అవగాహన ర్యాలీని సిద్దిపేట పట్టణంలో మెరిడియన్ విద్యార్థులు చేపట్టారు. డ్రగ్స్ వాడకం వలన జరిగే అనర్థాలపై నినదిస్తూ ర్యాలీ సాగింది. అంతకుముందు పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థులకు డ్రగ్స్ వాడకం వలన ఎలాంటి ఇబ్బందులు వస్తాయనే అంశాన్ని టూ టౌన్ ఎస్ఐ విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో విద్యార్థి బాధ్యత అనే అంశంపై నిర్వహించిన వ్యాస రచన పోటీలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మేనేజింగ్ డైరెక్టర్లు దేవేందర్ రెడ్డి, రాజావెంకటరెడ్డి, ప్రిన్సిపాల్ అంబటి మహేందర్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



బెజ్జంకి క్రాసింగ్‌లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏపీఎం పరశురాములు

బెజ్జంకి/చేర్యాల/హుస్నాబాద్ రూరల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని ఐకేపీ ఏపీఎం పరశురాములు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని బెజ్జంకి క్రాసింగ్, చీలాపూర్, బెజ్జంకి వ్యవసాయ మార్కెట్ యార్డులో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని రకాల మౌళిక వసతులు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. అదే విధంగా చేర్యాల మండలం ఆకునూరు, ముస్త్యాల గ్రామాలలో ఐకేపీ ఆధ్వర్యంలో, నాగపురి గ్రామంలో టీ-సెర్ప్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో సీసీలు, సిబ్బంది పాల్గొన్నారు.

హుస్నాబాద్ మండలం పోతారం(ఎస్)లో బుధవారం సాయంత్రం ఐకేపీ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మండల స్పెషల్ ఆఫీసర్ వెంకటరెడ్డి ప్రారంభించారు. ప్రభుత్వ మద్దతు ధర ఏ గ్రేడ్ 2389, సాధారణ రకం ధర 2369లకు నిర్ణయించినట్లు తెలిపారు.

పౌష్టికాహారంతో తల్లీబిడ్డ క్షేమం



చిన్నారులకు అన్నప్రాసన చేస్తున్న సీడీపీవో జయప్రద

బెజ్జంకి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : పౌష్టికాహారం తీసుకోవడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంతో తల్లి, బిడ్డ క్షేమంగా ఉంటారని సీడీపీవో జయప్రద పేర్కొన్నారు. పోషణ మాసం కార్యక్రమంలో భాగంగా బుధవారం బెజ్జంకి రైతు వేదికలో పోషణ మాస ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలకు పోషకాహార ప్రాముఖ్యతను గూర్చి వివరించారు. అనంతరం చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నాగరాణి, అంగన్‌వాడీ టీచర్లు, గర్భిణులు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

ఇక.. ఠాణాల్లో పైరవీలు బంద్

(5వ పేజీ తరువాయి)

సమాచారం ఇవ్వాలని కోరారు. సుప్రీంకోర్టు సూచనల ప్రకారం రాత్రి 10గంటల తర్వాత సౌండ్ సిస్టం నిషేధమని, డీజే వినియోగిస్తే కఠిన చర్యలు తప్పవని సీపీ హెచ్చరించారు. పేకాట, బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం, మైనర్ డ్రైవింగ్, ఓవర్ స్పీడ్ అంశాలపై ఫోకస్ పెడతామన్నారు. సమిష్టిగా కృషి చేస్తేనే ఇలాంటి వాటి నియంత్రణ సాధ్యమవుతుందని స్పష్టం చేశారు.

ఎన్నికలపై నిఘా..

స్థానిక, పంచాయతీ ఎన్నికల నిర్వహణపై సిద్ధంగా ఉన్నామని సీపీ విజయ్‌కుమార్ వివరించారు. జిల్లాలో సమస్యాత్మక, అతిసమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించామని చెప్పారు. రూ.50వేలకు మించి డబ్బులు తీసుకెళ్తే తగిన లెక్కలు చూపించాలని, లేదంటే సీజ్ చేయడం జరుగుతుందని తెలిపారు. మాడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌కు విరుద్ధంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ఎన్నికల్లో డబ్బు, మద్యం పంపిణీపై ప్రత్యేక నిఘా ఉంటుందని చెప్పుకొచ్చారు. సమావేశంలో అడిషనల్ సీపీ కుశాల్కర్, గజ్వేల్, సిద్దిపేట, హుస్నాబాద్ ఏసీపీలు నర్సింహులు, రవీందర్‌రెడ్డి, సదానందం, ఎస్బీఐ కిరణ్ పాల్గొన్నారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలి



మార్కెట్ యార్డులో రైతులతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

సిద్దిపేట కలెక్టరేట్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకుండా రైతన్నల నడ్డి విరుస్తుందని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పాల సాయిరాం, ఎడ్ల సోమిరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు కోల రమేష్ గౌడ్ విమర్శించారు. నెల రోజులుగా మార్కెట్ యార్డులో మక్కలు పోసి వేచి చూస్తున్నా ఇప్పటి వరకు కొనుగోలు కేంద్రాలు ప్రారంభించలేదని ఇది రైతులపై కాంగ్రెస్ పార్టీకి ఉన్న చిత్తశుద్ధి అని వారు మండిపడ్డారు. బుధవారం సిద్దిపేట మార్కెట్ యార్డును బీఆర్ఎస్ నాయకులు సందర్శించారు. గత నెల రోజులుగా మార్కెట్లో మక్కలు పోసి ఇబ్బందులు పడుతున్న రైతులతో మాట్లాడి వారి ఇబ్బందులు తెలుసుకున్నారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం ద్వారా రైతులు వేచి చూసి తప్పనిసరి పరిస్థితుల్లో తక్కువ ధరకే ప్రైవేట్ వ్యక్తులకు అమ్ముకోవాల్సి వస్తుందన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి సిద్దిపేటలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేదా రైతుల పక్షాన పోరాటం చేస్తామని హెచ్చరించారు.

స్లాట్ ఉంటేనే పత్తికి మద్దతు!

(5వ పేజీ తరువాయి)

వేశారు. పత్తి కొనుగోలు కోసం జిల్లాలో 23 జిన్నింగ్ మిల్లులలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ ఏడాది క్వింటాలుకు 8 శాతం తేమ ఉంటే మద్దతు ధర రూ. 8,110 ఉంది. పత్తిలో తేమ శాతాన్ని బట్టి మద్దతు ధరలో మార్పులు ఉంటాయి. గత ఏడాది సీసీఐ 10.57 లక్షల క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేయగా, 1.50 లక్షల క్వింటాళ్ల పత్తిని ప్రైవేట్ కొనుగోలుదారులు కొనుగోలు చేశారు. ఈసారి కొనుగోలు ప్రక్రియను పకడ్బందీగా చేపట్టేందుకు జిల్లా అధికార యంత్రాంగం సిద్ధమైంది.

పకడ్బందీగా ఏర్పాట్లు



ఈ ఏడాది పత్తి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లను పకడ్బందీగా ఏర్పాటు చేస్తున్నాం. 'కపాస్ కిసాన్' యాప్ ద్వారా స్లాట్ బుక్ చేసుకున్న తర్వాతనే, వారికి కేటాయించిన సమయానికి వచ్చి రైతులు తమ పత్తి పంటను విక్రయించుకోవచ్చు. పత్తి రైతులు సీసీఐ కేంద్రాల్లోనే ప్రభుత్వ మద్దతు ధరతో తమ పంటను విక్రయించాలి.

- నాగరాజు, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి

పొదుపును జీవన విధానంగా మార్చుకోవాలి

కొండపాక, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): రెండు దశాబ్దాలుగా గ్రామీణుల్లో పొదుపు అలవాటును పెంపొందించేందుకు విధాతా పురుషుల పొదుపు సంఘం చేస్తున్న కృషి ప్రశంసనీయమని ఎమ్మెల్సీ వంటేరు యాదవరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని మర్పడగలో శ్రీ విజయదుర్గా సమేత సంతాన మల్లికార్జున స్వామి క్షేత్రంలో బుధవారం విధాతా పురుషుల పొదుపు సంఘం ఇరవై ఒకటవ వార్షిక మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పొదుపును జీవన విధానంగా మార్చుకోవడం ద్వారా కుటుంబాలు బాగుపడతాయన్నారు.సంఘ భవన నిర్మాణం కోసం ఎమ్మెల్సీ కోటా నిధులు కేటాయిస్తానని చెప్పారు.సమావేశానికి అధ్యక్షత వహించిన సంఘం అధ్యక్షుడు ఊడెం తిరుపతి రెడ్డి మాట్లాడుతూ 2003లో ప్రారంభమైన తమ సంఘం 250 మంది సభ్యులతో 51 లక్షల నిధులతో పురోగమిస్తోందన్నారు.ప్రభుత్వం పైన,బ్యాంకులపైన ఆధారపడకుండా పేదలకు ఆర్థిక స్వావలంబన కల్పించాలన్నదే తమ లక్ష్యమని చెప్పారు. సంఘం వ్యవస్థాపకుడు చెప్పెల హరినాథ శర్మ మాట్లాడుతూ నిస్వార్థంగా చేసే పని ఏదైనా సత్ఫలితాలనిస్తుందనడానికి విధాత పురోగతే తార్కాణమని తెలిపారు. తెలంగాణా గ్రామీణ బ్యాంక్ సరస్వతీ నగర్ మేనేజర్ శివప్రసాద్ మాట్లాడుతూ సభ్యులందరూ విధిగా ఇన్సూరెన్స్ చేసుకోవాలన్నారు. సమావేశంలో కోశాధికారి మర్యాల రవీందర్ ప్రవేశపెట్టిన వార్షిక నివేదికను సభ ఆమోదించింది. పర్యవేక్షకులు టి.మల్లేశం,రాజయ్య,యాదగిరి,గఫూర్,అభిలాష్, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు. మరణించిన సంఘ సభ్యులు గడీల కుమార్ కుటుంబ సభ్యులకు రూ.41,195, పిండి మల్లయ్య కుటుంబ సభ్యులకు రూ.16,370 ఎమ్మెల్సీ చేతుల మీదుగా అందజేశారు.



బీమా చెక్కును అందచేస్తున్న ఎమ్మెల్సీ తదితరులు

డ్రంకెన్ డ్రైవ్‌లో 34 మందికి జరిమానా.. ఒకరికి జైలు

గజ్వేల్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): గజ్వేల్ పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఇటీవల పోలీసులు నిర్వహించిన డ్రంకెన్‌డ్రైవ్‌లో 34 మంది పట్టుబడినట్టు ట్రాఫిక్ సీఐ మురళీ తెలిపారు. వారిని బుధవారం గజ్వేల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ మూల స్వాతిగౌడ్ ఎదుట కోర్టులో హాజరుపరచగా, విచారణ అనంతరం రూ.50వేల జరిమానా విధించారు. నిందితుల్లో ఒకరికి జరిమానాతో పాటు ఒకరోజు జైలుశిక్ష విధించినట్టు ట్రాఫిక్ సీఐ వెల్లడించారు.

వార్షిక పరీక్షలకు సన్నద్ధం కావాలి: డీఐఈవో

చిన్నకోడూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రతీ విద్యార్థి క్రమం తప్పకుండా కళాశాలకు హాజరై రాబోయే వార్షిక పరీక్షలకు ఇప్పటి నుంచే సన్నద్ధం కావాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి రవీందర్‌రెడ్డి సూచించారు. చిన్నకోడూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలను బుధవారం ఆయన ఆకస్మికంగా సందర్శించి పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఐఈవో తరగతి గదులకు వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. సిలబస్, ప్రాక్టికల్స్, రెగ్యులర్ అటెండెన్స్ గూర్చి పలు సూచనలు చేశారు. అనంతరం అధ్యాపకులతో సమావేశం నిర్వహించి విద్యార్థుల హాజరు శాతం, పూర్తి చేసిన సిలబస్ తదితర అంశాలను అడిగి తెలుసుకుని, తగిన సూచనలు చేశారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల క్షేత్ర పర్యటన



క్షేత్ర పర్యటనలో హుస్నాబాద్ డిగ్రీ కళాశాల విద్యార్థులు

హుస్నాబాద్ టౌన్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు బుధవారం ఉద్యమిత్ర నైపుణ్య అభివృద్ధి సమితి ఆధ్వర్యంలో అక్కన్నపేట మండలంలోని కుందనవానిపల్లిలో క్షేత్ర పర్యటన చేశారు. అగ్రిదూత్ అనే సంస్థ వ్యవస్థాపకులతో పాటు రైతులతో మాట్లాడి పలు అంశాలపై వివరాలు సేకరించారు. కృత్రిమ మేధను ఉపయోగించి వ్యవసాయ పంటల పరిరక్షణను ఏ విధంగా చేయవచ్చునో అగ్రిదూత్ అనే యాప్ సహ వ్యవస్థాపకుడు, ఐఐటీ ఢిల్లీ పూర్వ విద్యార్థి శాశ్వతరాజ్ వివరించారు. యాప్ ద్వారా కృత్రిమ మేధను ఉపయోగించి పంటలకు వచ్చే తెగుళ్లను, తేమ శాతాన్ని, శీతోష్ణస్థితి పరిస్థితులతో పాటు ధరల వివరాలను ఒక క్లిక్‌తో తెలుసుకోవచ్చుని వివరించారు. యాప్ వినియోగాన్ని విద్యార్థులకు చూపించారు. అనంతరం పాలీహౌజ్‌లో విద్యార్థులు కూరగాయల సాగును పరిశీలించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ విజయగిరి బిక్షపతి, ఏవో తస్లీమా, శ్రీలత, అధ్యాపకులు నైనాదేవి, రాజిరెడ్డి, కనకరాజు తదితరులున్నారు.

కాంగ్రెస్‌తోనే గ్రామాల అభివృద్ధి



శ్రీగిరిపల్లి గ్రామస్థులకు కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న నర్సారెడ్డి

గజ్వేల్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని సిద్దిపేట డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని శ్రీగిరిపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు బాల్‌రాజు, వెంకట్ తమ గ్రామస్థులతో కలసి కాంగ్రెస్ పార్టీలో చేరగా, వారికి డీసీసీ అధ్యక్షుడు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ అవినీతి, అక్రమాలతో రాష్ట్ర ఖజానా దివాలా తీసినప్పటికీ, రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి ముందుకు వెళ్తున్నారన్నారు. అన్ని రంగాల్లో అవినీతికి పాల్పడిన బీఆర్ఎస్ నాయకులు బాకీ కార్డులంటూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. తాము బీఆర్ఎస్ చేసిన ధోకాను ధోకా కార్డుల రూపంలో ప్రజల్లోకి తీసుకువెళ్తామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, వైస్‌చైర్మన్ సర్దార్‌ఖాన్, నెంటూరు కుమార్, చిమ్మిరెడ్డి, సుఖేందర్‌రెడ్డి, తదితరులున్నారు.

పేదలకు రేషన్ కార్డు ఇవ్వని బీఆర్ఎస్ ప్రభుత్వం

దౌల్తాబాద్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిరుపేదలకు రేషన్ కార్డు ఇవ్వలేదని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దార సత్యనారాయణ, దశరథ రెడ్డి విమర్శించారు. బుధవారం దౌల్తాబాద్ ప్రెస్ క్లబ్‌లోని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కర్నాల శ్రీనివాసరావు తో కలిసి విలేకరులతో మాట్లాడుతూ. యూరియా అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యం లేదని, యూరియా సరఫరా చేసేది కేంద్ర ప్రభుత్వమేనని కేంద్రం నుంచి యూరియా సరఫరా ఆలస్యమైందని మెదక్ ఎంపీ రఘునందన్ రావు రైతులకు చెప్పిన మాట వాస్తవమని గుర్తు చేశారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఆరోగ్యశ్రీ బకాయిలు చెల్లించకపోవడంతోనే, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై భారం పడి, ప్రత్యేక ఆరోగ్య సేవలు నిలిచిపోయే పరిస్థితి ఏర్పడిందని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు అన్ని తప్పకుండా నెరవేరుస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఆది బాలకృష్ణ, మాచిన్ పల్లి, దుద్దెడ స్వామి, మామిండ్ల స్వామి తదితరులు పాల్గొన్నారు,

సమస్యలు పరిష్కరించాలని కాలనీవాసుల ధర్నా



తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న శ్రీరాంనగర్, మొండిచింతల కాలనీ వాసులు

చేర్యాల, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల పట్టణ శివారు శ్రీరాంనగర్, మొండిచింతల కాలనీలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆయా కాలనీవాసులు బుధవారం తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బండకింది అరుణ్‌కుమార్ మాట్లాడుతూ ఆయా కాలనీలో కనీసవసతులు కరువయ్యాయన్నారు. రేషన్ డీలర్ లేకపోవడంతో సరుకులకోసం నాలుగు కిలోమీటర్ల దూరం వెళ్లేందుకు ఇబ్బందులుపడుతున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు పోలోజు శ్రీహరి, రాళ్లబండి భాస్కర్, ఇప్పకాయల శోభ, మేర్గోజు రాం ప్రసాద్, తేలు నర్సింహులు, తదితరులు పాల్గొన్నారు.

కోహెడలో ధ్వజ స్తంభ నిర్మాణానికి భూమి పూజ

కోహెడ, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): కోహెడ మండల కేంద్రంలో రూ. కోటి వ్యయంతో అయ్యప్పస్వామి నూతన ఆలయాన్ని దాతల సహకారంతో నిర్మిస్తున్నారు. బుధవారం ఆలయ ధ్వజస్తంభ నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. మండలంలోని రామచంద్రాపూర్ గ్రామానికి చెందిన బొబ్బల మోహన్‌రెడ్డి మూడున్నర లక్షలు ధ్వజస్తంభ నిర్మాణానికి విరాళంగా అందజేశారు. ఆదిశంకరాచార్యుల మఠాధిపతి ఉన్నికృష్ణన్ గురుస్వామి, పురోహితులు ప్రసాదరావు శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మోహన్‌రెడ్డి దంపతుల చేతుల మీదుగా ధ్వజస్తంభ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా శీల, యంత్ర పూజ చేసి ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో అయ్యప్ప ట్రస్ట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



పగలే వెలుగుతున్న విద్యుత్ దీపాలు

గజ్వేల్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): పట్టపగలే విద్యుత్ దీపాలు వెలుగుతున్నాయి. వాటిని ఆఫ్ చేయాల్సిన అధికారులు, సిబ్బంది చోద్యం చూస్తున్నారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్ బస్‌డిపో పక్కన గల క్యాసారం రోడ్డులో గల స్తంభాలకు విద్యుత్ దీపాలు 24గంటలు వెలుగుతూనే ఉన్నాయి. ఇందుకు ప్రజల సొమ్ము కరెంట్ బిల్లుల రూపంలో చెల్లిస్తున్నారు. వెంటనే ఆన్/ఆఫ్ స్విచ్‌ను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.